సాక్షి

పార్వతీపురం మన్యం

శనివారం । 21 । జనవరి । 2023



విద్యుత్ చౌర్యంపై ఉక్కు పాదం

విద్యుత్ అక్రమంగా వినియోగించేవారిపై ఆ శాఖ అధికారులు నిఘా పెట్టారు. కేసులు నమోదుచేస్తున్నారు. - IIలో



రాజాం అభివృద్ధిపై జీఎంఆర్‌తో సమీక్ష

రాజాం అభివృద్ధిపై పారిశ్రామిక వేత్త గ్రంథి మల్లిఖార్జునరావుతో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు సమీక్షించారు. - IIలో

ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు 23న కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిల్లో 3 ల్యాబ్ అటెండెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మ లీల, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ఖాతాలలో జమ

పార్వతీపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో 2020 – 21, 2021 – 22 విద్యా సంవత్సరంలో ఎంపిక కాబడిన, రెన్యువల్ చేసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను విద్యార్థుల ఖాతాల్లో జమ చేసినట్లు డీఈఓ ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ విద్యా మంత్రిత్వ శాఖ అధికారులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లను జమ చేశారన్నారు. బ్యాంకు ఖాతా వివరాలను తప్పుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు నగదు జమచేయడం వీలుకాకపోవడం వల్ల ఆయా విద్యార్థులు అప్లికేషన్‌లో నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ సందేశాన్ని పంపించారన్నారు. స్కాలర్‌షిప్ జమకాని విద్యార్థులు స్టూడెంట్ లాగిన్‌లో వివరాలు సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు.

ఈ క్రాప్ మేరకు ధాన్యం కొనుగోలు

- జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు నాగేశ్వరరావు

పార్వతీపురం: ఈ క్రాప్ చేసిన రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి నిర్ణయించింది. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు చిన్న చిన్నలోటుపాట్లు మినహా చక్కగా సాగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంకు సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్టు వెల్లడించారు. జేసీ ఒ.ఆనంద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 188 ఆర్‌బీకేల ద్వారా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసినట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ రబీకి అపరాలు, చోడి, వేరుశనగ, వరి విత్తనాలు 1170 క్వింటాళ్లను 50 శాతం, 90 శాతం రాయితీపై సరఫరా చేశామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం నాగార్జున, జిల్లా ఉద్యానఅధికారి కేఎస్ఎస్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు, జిల్లా సూక్ష్మనీటి అధికారి ఎల్.శ్రీనివాసరావు, పౌరసరఫరాల సంస్థ జీఎం ఎం.దేవ్ళనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా ధాన్యం రాకుండా చర్యలు



పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఒడిశా నుంచి ఆంధ్రాకు ధాన్యం అక్రమ రవాణాకు చెక్‌పెట్టే చర్యలు చేపట్టామని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో మార్కెట్ యార్డు వద్ద మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం దాడులు జరిపారు. ధాన్యం ఎక్కువగా రవాణా జరుగుతున్న పార్వతీపురంలో ఏంవీఐలు సత్యనారాయణ, వరప్రసాద్, పాలకొండలో నవీన్‌కుమార్, వేణుగోపాలరావు, సాలూరులో ప్రసాద్, కాశీరాంలు ప్రత్యేక బృందాలుగా ఎర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నిఘా నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం సేకరణ చివరిదశకు చేరిందన్నారు.

చింతలబెలగాంలో ఏనుగుల గుంపు



చింతలబెలగాం వద్ద రహదారిపైకి వస్తున్న గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఏనుగుల గుంపు దర్శనమిచ్చింది. చింతలబెలగాం, గిజబ రహదారిపై సంచరించడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. రాత్రి సమయాన బాసంగి, వెంకటరాజపురం, పెదకుదమ, చినకుదమ గ్రామ పరిసరాల్లోకి వచ్చే అవకాశం ఉందని, ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరారు.

మీ క్షేమమే.. కుటుంబానికి రక్షణ



జెండాఊపి రహదారి భద్రతా వారోత్సవ బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

జిల్లాలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాద వివరాలు...	
మండలాలు:	15
రెవెన్యూ గ్రామాలు:	980
పోలీస్ స్టేషన్లు:	21
రహదారి ప్రమాదాలు:	267
మృతి చెందినవారు:	75
గాయపడిన వారు:	439

- జిల్లా కేంద్రంలో ప్రారంభమైన రహదారి భద్రతా వారోత్సవాలు
- ఈ నెల 24 వరకు వారోత్సవాల నిర్వహణ
- పట్టణంలో బైక్ ర్యాలీతో అవగాహన

పార్వతీపురం టౌన్:

మీ క్షేమమే.. మీ కుటుంబానికి రక్షణ అని, వాహనచోదకులు రహదారి భద్రత నియయ నిబంధనలను విధిగా పాటించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతావారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 24 వరకు రహదారి భద్రత వారోత్సవాలు సాగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్ట రీత్యా నేరమన్నారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించిన అంశాల పరిష్కారానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. చాలాచోట్ల బ్లాక్ స్పాట్స్ గుర్తించి సేఫ్టీ స్పాట్లుగా మార్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. అతివేగం ప్రమాదకరమన్నారు. చాలా ప్రమాదాల్లో ఎలాంటి తప్పుచేయనివారు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. 90 శాతం రోడ్డు ప్రమాదాలకు మానవతప్పిదాలే కారణమన్నారు. అనంతరం ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఏఎంవీఐలు సత్యనారాయణ, వరప్రసాద్, రమేష్‌కుమార్, రూరల్ ఎస్ఐ వై.సింహాచలం, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు, వాహనచోదకులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి



రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి. వాహన చోదకులు నిర్లక్ష్యంవహిస్తే ప్రాణాలకే ప్రమాదం. హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలి. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చెయకూడదు.

– శశికుమార్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, పార్వతీపురం మన్యం

యువతతోనే మార్పు సాధ్యం



యువతలో మార్పుతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యం. అతివేగం, ఏమరపాటు డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వందలాది మంది ప్రాణాలు విడుస్తున్నారు. మరింతమంది క్షతగాత్రులవుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు, జైలు శిక్ష విధిస్తారు. రిజిస్ట్రేషన లేకుంగా విహానాలు నడపడం చట్టరీత్యా నేరం. ఈ నెల 24 వరకూ జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తాం. రోడ్డు నిబంధనలు వివరిస్తాం.

– సి.మల్లిఖార్జున రెడ్డి, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

ఇళ్ల నిర్మాణాలు అడ్డుకుంటే చర్యలు తప్పవు



తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఎవరైనా అడ్డుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. లక్ష్యం పూర్తిచేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మక్కువ మండల పరిషత్ కార్యాలయంలో పేదల ఇళ్ల నిర్మాణాలపై గృహనిర్మాణశాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షించారు. వస్తున్న ఉగాది నాటికి 9వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాల్సి ఉందన్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఇళ్ల రుణాలు ఎంతమంది తీసుకున్నారన్న ప్రశ్నకు సరైన సమాధానం చెప్పని చప్పబుచ్చమ్మపేట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రఘురామ్‌ను ఆదేశించారు. పనసబద్ర సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సీత పనితీరు సంతృప్తిగా ఉందని, ఆమెకు మెరిట్ సర్టిఫికేట్ ఇవ్వాలని సూచించారు. తూరుమామిడి సచివాలయం పరిధిలో ఇంతవరకు ల్యాండ్‌లెవిలింగ్ జరిపించకపోతే, ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారంటూ అసహనం వ్యక్తంచేశారు. మక్కువకు చెందిన లబ్ధిదారులకు రెండు గంటల్లో పట్టాలు పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామంటూ తహసీల్దార్ సూర్యానారాయణపై మండిపడ్డారు. మరో 10 రోజుల్లో సమీక్ష నిర్వహిస్తానని, మార్పు కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.దేవకుమార్, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండకు ఆక్వాహబ్



మత్స్యకారులకు ప్రభుత్వ రాయితీలు వివరిస్తున్న అధికారి గోపీకృష్ణ

పాలకొండ రూరల్: మత్స్యకారులను ప్రోత్సహించే క్రమంలో రూ.కోటి విలువైన ఆక్వాహబ్ ప్రాజెక్టు పాలకొండకు మంజూరైనట్టు స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డబ్బీరు గోపీకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో మత్స్యకార సంఘ నాయకులు, రాయితీ సామగ్రి అందుకునే లబ్ధిదారులతో శుక్రవారం మాట్లాడారు. ఆక్వాహబ్‌ను పాలకొండ పరిసరాల్లో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ హబ్ ద్వారా ఫిష్ ఆంధ్రా షాపులకు నాణ్యమైన, బతికిన చేపలను సరఫరా చేస్తామని చెప్పారు. సీతంపేటలో రూ.50 లక్షల విలువైన రెస్టారెంట్ మంజూరైనట్టు తెలిపారు. ఫిష్ కియోస్కులను ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 60 శాతం, సాధారణ కేటగిరీకి చెందిన వారికి 40 శాతం రాయితీపై ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. జిల్లాకు మూడు చక్రాల వాహనాలు ఆరు, నాలుగు చక్రాల వాహనాలు నాలుగు మంజూరైనట్లు తెలిపారు. ఔత్సాహిక మత్సకారులు ప్రభుత్వ రాయితీలు పొందేందుకు తన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా బోధన



స్కిల్ డెవెలప్‌మెంట్ మెటీరియల్‌ను విడుదల చేస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్న్‌షిప్ ఓఎస్‌డీ డాక్టర్ అనిల్‌కుమార్

విజయనగరం అర్బన్: డిగ్రీ విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా బోధన సాగిస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్న్‌షిప్ ఓఎస్‌డీ, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రాంగణంలో వినూత్నంగా రూపొందించిన 'స్కిల్ డెవెలప్‌మెంట్ మెటీరియల్'ను శుక్రవారం విడుదల చేశారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ మెటీరియల్‌ను నిష్ణాతులైన విద్యావేత్తలతో రూపొందించినట్టు వెల్లడించారు. బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు 17 అంశాల్లో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. వీటి బోధనకు అధ్యాపకులకు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రంలో 3 వేల మంది అధ్యాపకులకు శిక్షణ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బీ.సుభ, పీడీ డాక్టర్ జయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు భవానీ, రమాగీత, సులోచన పాల్గొన్నారు.

నేడు కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ రాక

ఇంటర్మీడియట్ కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ శనివారం పట్టణానికి రానున్నారని ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. ఉత్తరాంధ్ర స్థాయిలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కమిషనర్ ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల సమావేశ మందిరంలో నిర్వహిస్తారని తెలిపారు. సమీక్ష సమావేశానికి విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు జిల్లాల పరిధిలోని 43 కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఐక్యూఏసీ సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు.

వచ్చేనెల 5న ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష

పార్వతీపురం: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)ను ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్టు డీఈఓ ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయిన ఆయా పాఠశాల విద్యార్థుల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలన్నారు.

ఈనెల 22న ఓబీఈ పరీక్షలు

ఈనెల 22న ఓబీఈ పరీక్షలను జిల్లాలోని ఐదు కేంద్రాల్లో (పార్వతీపురంలో–3, పాలకొండలో–2) నిర్వహిస్తామని డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి డీఈఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ టి.సుధాకరరావు, జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోటీలకు సిద్ధమవుతున్న విజయనగరం జిల్లా క్రీడాకారులు



క్రీడా పోటీలకు వేళాయె..

- జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు
- 23 నుంచి అలుగోలులో అండర్–17 కబడ్డీ పోటీలు
- 30 నుంచి పార్వతీపురంలో అండర్–14,17 విభాగాల్లో ఆర్చరీ పోటీలు
- పోటీల్లో పాల్గొననున్న 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసిన ఎస్‌జీఎఫ్
- కబడ్డీ పోటీల నిర్వహణకు రూ.లక్ష విరాళమిచ్చిన జెడ్పీచైర్మన్
- పోటీల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు అతిథ్యమివ్వనున్న అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విజయనగరం:

పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడాప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహించే స్కూల్‌గేమ్స్ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా అతిథ్యమివ్వనుంది. కరోనా నేపథ్యంలో గడిచిన రెండేళ్లు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించకపోగా.. ఈ ఏడాది పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జిల్లాలో అండర్–17 విభాగంలో బాల, బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించనుండగా.. అండర్–14,17 వయస్సుల విభాగాల్లో ఆర్చరీ పోటీలు నిర్వహించేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏర్పాట్లు చేస్తోంది.

అలుగోలులో కబడ్డీ పోటీలు..

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ ఏడాది స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా... జిల్లాలోని నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 23 ,24, 25 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో అండర్–17 విభాగంలో బాల, బాలికల జట్లు తలపడనున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.లక్ష మొత్తాన్ని ఇప్పటికే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులకు అందజేశారు.

ఇదిలా ఉండగా పోటీల నిర్వహణకు సంబంధించి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 26 జట్లు ప్రాతినిథ్యం వహించనుండగా.. 400 మంది వరకు క్రీడాకారులు, ఆయా టీమ్‌ల కోచ్ అండ్ మేనేజర్‌లు హాజరుకానున్నారు. వారికి అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్వతీపురంలో ఆర్చరీ పోటీలు..

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు పార్వతీపురంలో ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు అండర్–14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలు తలపడనున్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలగానే నిర్వహిస్తుండగా... 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించనున్నారు.



కబడ్డీ పోటీలకు సిద్ధమైన అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం

రాష్ట్ర స్థాయి పోటీలకు ముమ్మర ఏర్పాట్లు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు ప్రాంతాల్లో రెండు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–17 విభాగంలో కబడ్డీ పోటీలు, పార్వతీపురంలో అండర్–14,17 విభాగాల్లో ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరుకానున్నారు. వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు పోటీలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీల నిర్వహణకు జిల్లా ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం మరువలేనిది.

– లెంక వెంకటరమణ, కార్యదర్శి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విజయనగరం

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- వైద్యశిబిరాల నిర్వహణ



జాతర ఏర్పాట్లపై అధికారులుతో చర్చిస్తున్న జేసీ ఆనంద్

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంలో ఆలయ, జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. జాతర ఏర్పాట్లను జేసీ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చదురుగుడి, వనంగుడి క్యూలను పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి క్యూ పద్ధతిలో పంపించే విధానాన్ని డీఎస్పీ సుభాష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జాతరకు అధికసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈఓ రాధాకృష్ణను ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్యపనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ హేమలత, సీఐ ధనుంజయరావు, ఎస్ఐ షైడిరాజు, ట్రస్టు బోర్డు చైర్మన్ దాలినాయుడు, ఉపసర్పంచ్ వెంకటరమణ, మురళీనాయుడు ఉన్నారు.

అమ్మవారి ఘటాలకు పూజలు



అమ్మవారి ఘటాలుకు పూజలు చేస్తున్న భక్తులు

చదురుగుడిలోని శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలకు భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు.

24 గంటలూ వైద్యసేవలు

శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు 24 గంటలూ వైద్యసేవలందిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు తెలిపారు. శంబర పిహెచ్‌సీను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రఘు, కిరణ్ తోపాటు, సిబ్బందితో మాట్లాడారు. జాతరకు లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశమున్నందున వైద్యసేవలు సక్రమంగా అందించాలన్నారు. భక్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యసేవల కోసం 9 మంది వైద్యాధికారులను నియమించామని, షిఫ్ట్ పద్ధతిలో సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తారన్నారు. 108 అంబెలెన్స్‌లు రెండు, 104 ఒకటి, ఫీడర్ అంబులెన్స్‌లు 5 అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వనంగుడి, రామాలయం, చదురుగుడి క్యూ, అంగన్‌డీ కేంద్రం, పీహెచ్‌సీలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ దవళ భాస్కరరావు ఉన్నారు.



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు మిమ్స్ విద్యార్థిని


వందన

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్ విద్యార్థిని జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికై ంది. ఎస్ఆర్ఈటీ కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరపీలో బీపీటీ మొదటి సంవత్సరం చదువుతున్న రావాడ వందన తాజాగా విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మార్చి 9 నుంచి 12వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మ శాలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ కె.వెంకటరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ యాజమాన్యం వందనకు స్పాన్సర్‌షిప్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వందనను మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, లైఫ్ ట్రస్టీ రామకృష్ణరాజు, డీన్ డాక్టర్ లక్ష్మీ కుమార్, ప్రిన్సిపాల్ రవికుమార్, ఏఓ గణేష్ అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

భోగాపురం: మండలంలోని సుందరపేట, తోటపల్లి బస్ స్టాప్ కూడళ్ల వద్ద ఎస్ఐ కృష్ణ మూర్తి సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నాతవలస చంపావతి, రామచంద్రపేట ఉప్పుగెడ్డ నదుల నుంచి భోగాపురం వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేయగా, ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేశారు.

పౌరాణిక కళాకారుడు రామారావు మృతి


చీకటి రామారావు (ఫైల్)

రాజాం : పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు చీకటి రామారావు(78) శుక్రవారం మృతి చెందారు. ఈయన స్వగ్రామం తెర్లాం మండలం చీకటిపేట గ్రామం కాగా, డైట్ శిక్షణ అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి, రాజాంలో అమ్మవారి కాలనీలో స్థిర నివాసిగా ఉండిపోయారు. ఓ వైపు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూ మరో వైపు పౌరాణిక నాటక రంగాల్లో రాణించేవారు. కృష్ణుడుగా, అర్జునుడు, శ్రీరామునిగా, నక్షత్రునిగా ఎన్నో పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ఎంతో మంది రాష్ట్ర కళాకారుల సరసన నటించారు. మూడువేలకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఈయన నటనకు మూడు పర్యాయాలు నంది అవార్డు లభించింది. ఈయనకు భార్య పద్మావతితో పాటు ఒక కుమారుడు కన్నబాబు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామారావు మృతి వార్త తెలుసుకున్న ఆయన అభిమానులు, స్నేహితులు వందలాదిగా రాజాం చేరుకొని ఆయనకు నివాళులర్పించారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో పాటు పలువురు రంగస్థల కళాకారులు ఈయన మృతికి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ మృతి


బంగారు రాజు మృతదేహం

అద్దంకి: ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వంట మాస్టర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని అద్దంకి -నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని రెడ్డి కంచేరు గ్రామానికి చెందిన తాతారావు కుమారుడు బి.బంగారు రాజు అలియాస్ రెడ్డి (35) చిన్న వయసులోనే అద్దంకి వచ్చి హోటల్స్‌లో సర్వర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రస్తుతం ఒక మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు విజయనగరం జిల్లాలోని స్వగ్రామానికి వెళ్లాడు. శింగరకొండ నుంచి ఆటోలో ఎక్కి వస్తుండగా, పట్టణంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సీఐ రాజమోహన్, ఎస్ఐ సమందర్‌వలి ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక సీజ్

రేగిడి: మండల పరిధిలోని కందిశ, సంకిలి నాగావళి నది పరీవాహక తోటల్లో అక్రమంగా నిల్వ ఉన్న వంద టన్నుల ఇసుకను సీజ్ చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను శుక్రవారం పరిశీలించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగావళి నది పరీవాహక గ్రామాల్లో నిఘాను ఉంచామని, ఎవరైనా ఇసుకను తరలిస్తే బళ్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై ఉక్కు పాదం

విద్యుత్ వాడకంలో కొందరు తప్పుదోవలో వెళ్తున్నారు. దొడ్డిదారిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ఒక కేటగిరీకి కనెక్షన్ తీసుకొని వేరే కేటగిరీలో చౌర్యం చేస్తున్నారు. దీంతో భారీగా విద్యుత్ డిస్కంలకు నష్టం వాటిల్లుతుంది. దీన్ని గుర్తించిన అధికారులు వీటికి చెక్ పెట్టేందుకు దాడులు ప్రారంభించారు.


అక్రమ విద్యుత్ వాడకం

- ఆకస్మిక తనిఖీలతో కేసులు నమోదు
- 2022లో నమోదైన కేసులు 2703
- విధించిన అపరాధ రుసుం రూ.3.94 కోట్లు
- విద్యుత్ చౌర్యం కేసులు 1014
- అనధికారికంగా విద్యుత్ వాడే కేసులు 112
- అదనపు లోడు కేసులు 1399

విజయనగరం ఫోర్ట్: వేడుకలకు కొందరు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తుంటారు. మరి కొందరు గృహ విద్యుత్ మీటర్లతో చిన్నపాటి పిండి మిల్లులు, దుకాణాలు వంటివి నడుపుతుంటారు. ఇటువంటి వాటి వల్ల విద్యుత్ శాఖకు పెద్ద స్థాయిలో నష్టం వాటిల్లుతుంది. దీన్ని గుర్తించిన విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ అక్రమ వాడకందారులపై ఉక్కు పాదం మోపుతున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ విభాగంతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

2022లో నమోదైన కేసులు 2703

విద్యుత్ శాఖకు చెందిన విద్యుత్ చౌర్య విభాగం(విజిలెన్స్), ఆపరేషన్ ఇంజినీర్స్ వేర్వేరుగా తనిఖీలు చేపడుతున్నారు. 2022లో 2703 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి అపరాధ రుసుం రూ.3.94 కోట్లు విధించారు. వీటిలో విద్యుత్ చౌర్యం కేసులు 1014 కాగా అనధికారికంగా విద్యుత్ వాడే కేసులు 112, అదనపు లోడు కేసులు 1399 ఉన్నాయి.

అత్యాశకు పోయి బుక్కవుతున్నారు..

కొంతమంది అత్యాశకు పోయి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ సమయంలో విద్యుత్ శాఖ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విద్యుత్ ఎంత వినియోగించినా డబ్బులు కట్టనవసరం లేదు. అదే ఇంట్లో ఉన్న విద్యుత్ వినియోగిస్తే బిల్లు కట్టాలి.

అనుమతి ఉండాల్సిందే..

అదనపు లోడ్ వాడాలనుకుంటే విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి. కేటగిరి -1కి తీసుకుని షాపులకు వినియోగించడం నేరం. విద్యుత్ అక్రమంగా వినియోగించినట్టయితే విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ ఇంజినీర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారు.

– పి.నాగేశ్వరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ

జిల్లాలో కేటగిరీల వారీగా విద్యుత్ కనెక్షన్ల వివరాలు

కేటగిరి	విద్యుత్ కనెక్షన్ల సంఖ్య
కేటగిరి-1	6,41,271
కేటగిరి-2	74,288
కేటగిరి-3	3,606
కేటగిరి-4	12,696
హెచ్‌టీ	388
వ్యవసాయం	37,163

విజిలెన్స్ అధికారులు నమోదు చేసిన కేసులు, అపరాధ రుసుం వివరాలు...

విభాగం	నమోదు చేసిన కేసులు	అపరాధ రుసుం
అదనపు లోడ్	701	రూ.81.25 లక్షలు
షార్ట్ బిల్లింగ్	178	రూ.111.51 లక్షలు
విద్యుత్ చౌర్యం	528	రూ.120.26 లక్షలు
అనధికారిక వాడకం	98	రూ.20.14 లక్షలు

ఆపరేషన్ ఇంజినీర్స్ నమోదు చేసిన కేసులు, అపరాధ రుసుం వివరాలు

విభాగం	నమోదు చేసిన కేసులు	అపరాధ రుసుం
అదనపు లోడ్	690	రూ.56.20 లక్షలు
విద్యుత్ చౌర్యం	486	రూ.3.40 లక్షలు
అనధికారిక వాడకం	14	రూ.1.67 లక్షలు
మాల్ ప్రాక్టీస్	9	రూ.1.25 లక్షలు

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం


పెరుమాళిలో సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసు విషయమై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ ఎం.దీపికాపాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు శుక్రవారం సంఘటన జరిగిన ప్రదేశంతో పాటు, రహదారి పక్కనే పలుచోట్ల ఉన్న సీసీ పుటేజ్‌లను తనిఖీ చేశారు. ఈ నెల 16న వెలగవలస సమీపంలోని మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. గుర్తు తెలియని మృతదేహంపై కత్తిపోట్లు ఉండడంతో హత్య కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ దీపికాపాటిల్, బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు పరిశీలించారు. మృతదేహం లభ్యమైన విషయంపై అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని వారు ఆదేశించారు. దీనిపై గురువారం ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు, క్లూస్ టీం, పలువురు పోలీసులు వచ్చి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లడం, సీసీ పుటేజ్‌లను పరిశీలించడం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హత్య కేసుకు సంబంధించి తాము అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామని, మృతదేహంపై ఉన్న ఆనవాళ్ల ఆధారంగా ఆ వ్యక్తిగానీ, మిస్సింగ్ గురైన వ్యక్తుల వివరాలు తెలిసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మృతదేహంతో పాటు అతని వివరాలు తెలిపే వాల్‌పోస్టర్లు గ్రామాల్లోను, రోడ్ల కూడళ్లలో అతికించామని చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై విస్తృత ప్రచారం

- డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తోన్న వైద్య సేవలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆమె శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను శతశాతం సాధించాలని చెప్పారు. ఈ నెల 24వ తేదీన జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని సూచించారు. విధులు పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, ఎస్‌సీడీ ప్రొగ్రాం అధికారి డాక్టర్ పి.రవికుమార్, డీఎంఓ డాక్టర్ ఎం.తులసి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు దక్కిన గౌరవం

- ప్రజా క్షేత్రానికి ప్రభుత్వ సేవలు అందించడంలో ముందంజ
- జాతీయ స్కోచ్ అవార్డుల ప్రదానంలో విజయనగరానికి చోటు
- రజిత పతకాన్ని కైవసం చేసుకున్న విజయనగరం కార్పొరేషన్



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు దక్కిన స్కోచ్ రజిత పతకం

విజయనగరం: దేశ వ్యాప్తంగా నిర్వహించిన స్కోచ్ అవార్డుల ఎంపికలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందించే విధానంలో శతశాతం నిర్వహణతో పాటు, పారదర్శకంగా అందించే విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ మేరకు స్కోచ్ అవార్డుల కమిటీ శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్ కమిషనర్‌కు లభించిన రజిత పతకాల వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో విజయనగరం కార్పొరేషన్ స్కోచ్ అవార్డుల ఎంపికలో రజిత పతకాన్ని సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న విజయనగరం కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తర్వాత అరుదైన గౌరవాన్ని దక్కించుకుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఉద్యోగుల సహాయ సహకారాలతోనే ఈ అవార్డు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి అవార్డులు సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ యంత్రాంగంలో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. కార్పొరేషన్ సిబ్బందితో బాధ్యత మరింత పెరగనుందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ప్రగతిని ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన

- డీఆర్ఓ గణపతిరావు


మాట్లాడుతున్న డీఆర్ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా రిపబ్లిక్ డే ఉత్సవాల్లో శకటాల ప్రదర్శన ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు చెప్పారు. శకటాలను ప్రదర్శించే ప్రభుత్వ శాఖలన్నీ తమ శకటాల డిజైన్లను శనివారం సాయంత్రం కల్లా సమర్పించాలని సూచించారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై డీఆర్ఓ శుక్రవారం తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయా శకటాల్లో ఏయే అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నదీ తెలియజేయాలన్నారు. శకటాలను ఆకర్షణీయంగా పూర్తి సమాచారంతో రూపొందించాలని ఈ అంశంలో అధికారులు వ్యక్తిగతంగా శ్రద్ధ వహించాలన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ ఉత్పత్తుల విక్రయం కోసం కౌంటర్లు ఏర్పాటు చేసే ప్రభుత్వ శాఖలు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్ష

జిల్లాలోని తహసీల్దార్లతో పలు రెవెన్యూ సంబంధ అంశాలపై డీఆర్ఓ శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో భూపట్టాల పంపిణీ, లబ్ధిదారుల జాబితాల తయారీపై పలు సూచనలు చేశారు. శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలను మరోసారి సరిచూసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి మొదటి వారంలో విశాఖలో జరగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల ప్రాంతీయ సదస్సులో మన జిల్లా రెవెన్యూ అంశాల్లో అగ్రస్థానంలో నిలిచేలా అధికారులంతా కృషి చేయాలని డీఆర్ఓ ఆదేశించారు.

లోకాయుక్త కేసుల్లో సకాలంలో స్పందించాలి

లోకాయుక్త కేసుల్లో వచ్చిన నోటీసులపై సంబంధిత శాఖల అధికారులు సకాలంలో ఆయా కేసులు విచారణకు వచ్చే ముందుగానే సమాధానాలు ఇవ్వాలని డీఆర్ఓ ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో విచారణకు రానున్న కేసులకు సంబంధించి నోటీసులకు జవాబులు ఇచ్చే అంశంపై శుక్రవారం తన చాంబర్‌లో సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను తెలుసుకొని అధికారులను సూచనలు చేశారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

29న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29న రాజీవ్‌నగర్ కాలనీ రోడ్డులో ఉన్న గాయత్రీభవన్‌లో సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శతవాధాని ఉప్పలధడియం భరత్‌శర్మ (తిరుపతి) ఆధ్వర్యంలో అవధాన వాణీవిలాసం అనే అంశంపై ప్రాశ్నిక పరిషత్తు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న సదస్సుకు సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9951602843, 8121703348

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రాజాం అభివృద్ధిపై జీఎంఆర్‌తో సమీక్ష


రాజాం అభివృద్ధిపై జరిగిన సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగులు, జీఎంఆర్

రాజాం: రాజాం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావుతో ఎమ్మెల్యే కంబాల జోగులు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు సమీక్ష నిర్వహించారు. జీఎంఆర్ ఐటీ గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ వ్యవస్థ బాగుందని అన్నారు. రాజాం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు రహదారిపై మాట్లాడారు. మేదరవీధి వద్ద రోడ్డు సమస్యను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, తన వంతు సాయం అందిస్తామని వెల్లడించారు. అక్కడి రోడ్డు పక్క నిర్వాసితులకు వేరే ప్రాంతం వద్ద స్థలాలు చూపించే కార్యక్రమం చేద్దామని అన్నారు. నియోజకవర్గ పరిధిలో వంగరలోని సంగాం దేవాలయ అభివృద్ధికి తన వంతుగా రూ. 5 లక్షలు సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆలయానికి ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించగా డిపాజిట్ రూ.20 లక్షలు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ డిపాజిట్‌కు సంబంధించి రూ. 5 లక్షలు ఇస్తున్నట్లు జీఎంఆర్ పేర్కొన్నారు. కొండంపేట నుంచి జీఎంఆర్ ఐటీకి బీటీ రోడ్డు నిర్మాణంపై మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఇటీవల వేగవంతం అయ్యిందని, ప్రభుత్వం రాజాంలో రోడ్డు విస్తరణపై దృష్టి సారించడం అభినందనీయమని జీఎంఆర్ ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. సమీక్షలో రాజాం టౌన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పాట్నూరు లక్ష్మణరావు, జీఎంఆర్ పీఏ అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.